త్రినాథ వ్రతకల్పము

భూశుద్ధి :

ఇంటిలో ఈశాన్య మూలలో స్థలమును శుద్ధి చేసి, అలికి, బియ్యపు పిండితోగాని, రంగుల చూర్ణములతో గాని, ముగ్గులు పెట్టి, దైవస్థాపన నిమిత్తమై ఒక పీటను వేయాలి. పీట మరీ ఎత్తుగాగాని, మరీ పల్లముగా గానీ ఉండకూడదు. పిదప ఆ పీటకు కూడా చక్కగా పసుపురాసి, కుంకుమతో బొట్టుపెట్టి, వరి పిండి (బియ్యపుపిండి) తో ముగ్గు వేయాలి. సాధారణంగా అష్టదళపద్మాన్నే వేస్తారు. పూజ చేసేవారు తూర్పుముఖంగా కూర్చోవాలి. ఏ దైవాన్ని పూజింజబోతున్నారో ఆ దైవంయొక్క ప్రతిమనుగాని, చిత్రపటమునుగాని ఆ పీటపై ఉంచాలి. ముందుగా పసుపుతో గణపతిని తయారు చేసి (పసుపును షుమారు అంగుళం సైజులో త్రికోణ ఆకృతిలో ముద్దగాచేసి), దానికి కుంకుమ బొట్టు పెట్టి, పిదప ఒక పళ్ళెంలోగాని, క్రొత్త తుండుగుడ్డమీదగాని బియ్యం పోసి దానిపై ఒక తమలపాకునుంచి, అందు పసుపు గణపతినుంచి అగరువత్తులు వెలిగించాలి. ఇపుడు పూజకు కావలసిన వస్తువులను అమర్చుకోవాలి. దీపారాధన నైబుతి దిశలో చేయవలెను.

దీపారాధనకు కావలసిన వస్తువులు - దీపారాధన విధానము :దీపారాధన చేయుటకు కుంది (ప్రమిద) వెండిదిగాని, ఇత్తడిదిగాని, మట్టిదిగాని వాడవచ్చును. కుందిలో 3 అడ్డవత్తులు 1 కుంభ వత్తి (మధ్యలో) వేసి నూనెతో తడుపవలెను. ఇంకొక అడ్డవత్తి నూనెతో తడిపి ఏకహారతిలో (కర్పూర హారతికి వాడే వస్తువు) వేసి ముందుగా ఏకహారతిలో వేసిన వత్తిని అగ్గిపుల్లతో వెలిగించి, వెలిగించిన వత్తితో కుందిలోని 1 అడ్డవత్తి 1 కుంభవత్తి వెలిగించవలెను. తర్వాతచేయి కడుక్కునినూనె కుందినిండా వేసి పిదప ఆ కుందికి మూడు చోట్ల కుంకుమ అలంకారము చేయవలెను. తర్వాత అక్షతలు వేసి దీపారాధనను లక్ష్మీస్వరూపముగా భావించి నమస్కారము చేయవలెను. కుందిలో మిగిలిన రెండు అడ్డవత్తులు పూజా సమయంలో ధూపము చూపిన తరువాత దీపము చూపించుటకు వాడవలెను. దీపారాధనకు నువ్వులనూనెగాని,కొబ్బరి నూనెగాని, ఆవునెయ్యిగాని వాడవచ్చును. ఈవిధంగా దీపం వెలిగించి ఘంటను వాయిస్తూ నమస్కరించి ఈ క్రింది శ్లోకమును చదువుకొనవలెను.

ఘంటానాదము :

శ్లో॥ ఆగమార్థంతు దేవానాం గమనార్థంతు రక్షసామ్
కుర్యాద్ఘంటారవం తత్ర దేవతా హ్వాహనలాంఛనమ్

మనము ఆచమనము చేసినటువంటి పంచపాత్రలోని నీళ్లు దేవుని పూజకు వినియోగించరాదు. పూజకు విడిగా ఒకగ్లాసుగాని, చెంబుగాని తీసుకొని దానిలో శుద్ధ జలమును పోసి ఆ చెంబునకు కలశారాధన చేసి ఆ నీళ్లు మాత్రమే దేవుని పూజకు ఉపయోగించవలెను.

పూజకు కావలసిన వస్తువులు:త్రినాథుని (ఏ వ్రతమును (పూజను) ఆచరించుచున్నామో ఆ దేవుని యొక్క బొమ్మ (ప్రతిమ) (తమ శక్తికొలది బంగారముతోనైనను, వెండితో నైనను లేక మట్టితోనైనను తీసుకొనవలెను), లేదా చిత్రపటము, మండపమునకు మామిడి ఆకులు, అరటి మొక్కలు, కొబ్బరికాయలు, పళ్లు, పువ్వులు, పసుపు, కుంకుమ, గంధం, హారతి కర్పూరం, అక్షతలు, అగ్గిపెట్టె, అగరువత్తులు, వస్త్ర, యజ్ఞో పవీతములు, తోరములు (తెల్లని దారమునకు పసుపురాసి 9 వరుసలు (పోగులు) వేసి 9 చోట్ల పువ్వులతో కట్టి, ఈ తోరములను త్రినాథునికి పూజచేసి పూజచేసిన వారందరూ తమ కుడిచేతికి ధరిస్తారు.) ప్రత్యేక నివేదన (పిండివంటలు)పిమ్మట యజమానులు (పూజచేసేవారు) ఈ దిగువకేశవనామాలనుస్మరిస్తూఆచమనంచేయాలి.

ఈ నామములు మొత్తం 24 కలవు.

1. 'ఓం కేశవాయ స్వాహా' అని చెప్పుకుని చేతిలో నీరు తీసుకొని లోనికి తీసుకోవాలి.

2. 'ఓం నారాయణాయ స్వాహా' అనుకుని ఒకసారి

3. 'ఓం మాధవాయ స్వాహా' అనుకుని ఒకసారి జలమును పుచ్చుకోవలెను. తరువాత

4. 'ఓం గోవిందాయ నమః' అని చేతులు కడుగుకోవాలి.

5. 'విష్ణవే నమః' అనుకుంటూ నీళ్ళు త్రాగి, మధ్య వ్రేలు, బొటనవ్రేళ్లతో కళ్లు తుడుచుకోవాలి.

6. 'ఓం మధుసూదనాయ నమః' అని పై పెదవిని కుడినుంచి ఎడమకి నిమురుకోవాలి.

7. 'ఓం త్రివిక్రమాయ నమః' క్రింది పెదవిని కుడినుంచి ఎడమకి నిమురుకోవాలి.

8,9. 'ఓం వామనాయ నమః' 'ఓం శ్రీధరాయ నమః' ఈ రెండు నామాలు స్మరిస్తూ తలపై కొంచెం నీళ్లు చల్లుకోవాలి.

10. ఓం హృషీకేశాయ నమః ఎడమ చేతితో నీళ్లు చల్లాలి.

11. ఓం పద్మనాభాయ నమః పాదాలపై ఒక్కొక్క చుక్క నీరు చల్లుకోవాలి.

12. ఓం దామోదరాయ నమః శిరస్సుపై జలమును ప్రోక్షించుకోవలెను.

13. ఓం సంకర్షణాయ నమః చేతివ్రేళ్లు గిన్నెలా వుంచి గడ్డము తుడుచుకోవలెను.

14. ఓం వాసుదేవాయ నమః వ్రేళ్లతో ముక్కును వదులుగా పట్టుకోవలెను.

15,16. ఓం ప్రద్యుమ్నాయ నమః ఓం అనిరుద్ధాయ నమః నేత్రాలు తాకవలెను.

17,18. ఓం పురుషోత్తమాయ నమః ఓం అధోక్షజాయ నమః రెండు చెవులూ తాకవలెను.

19,20. ఓం నారసింహాయ నమః ఓం అచ్యుతాయ నమః బొడ్డును స్పృశించవలెను.

21. ఓం జనార్దనాయ నమః చేతివ్రేళ్లతో వక్ష స్థలం, హృదయం తాకవలెను.

22. ఓం ఉపేంద్రాయ నమః చేతి కొనతో శిరస్సు తాకవలెను.

23,24. ఓం హరయే నమః ఓం శ్రీకృష్ణాయ నమః కుడి మూపురమును ఎడమ చేతితో ను, ఎడమ మూపురమును కుడిచేతిఆచమనము చేసిన తరువాత ఆచమనము చేసి, వెంటనే సంకల్పము చెప్పుకోవలెను.ఆచమనము అయిన తరువాత, కొంచెం నీరు చేతిలో పోసుకుని నేలపై చిలకరించుతూ ఈ శ్లోకము పఠించవలెను.

శ్లో॥ ఉత్తిష్ఠంతు భూత పిశాచాః యేతే భూమిభారకాః

యేతేషామవిరోధేన బ్రహ్మకర్మ సమారభే ॥

ప్రాణాయామమ్య : ఓం భూః - ఓం భువః ఓం సువః - ఓం మహః - ఓం జనః ఓం తపః - ఓగ్ ం సత్యం - ఓం తత్ సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహిధియోయోనః ప్రచోదయాత్ - ఓం ఆపోజ్యోతిరసోమృతం బ్రహ్మ భూర్భువస్సువరోం అని సంకల్పము చెప్పుకొనవలెను.

సంకల్పము : మమ ఉపాత్త సమస్త దురితక్షయ ద్వారా శ్రీ పరమేశ్వర ముద్దిశ్య శ్రీపరమేశ్వర ప్రీత్యర్థం శుభే శోభన ముహూర్తే ఆద్య బ్రహ్మణః (ఇక్కడ శ్రీ మహావిష్ణో రాజ్ఞయా అని కూడా చెప్పవచ్చు) ద్వితీయ పరార్థే శ్వేత వరాహ కల్పే వైవస్వత మన్వంతరే కలియుగే ప్రథమపాదే జంబూ ద్వీపే భరతవర్షే భరత ఖండే మేరోర్దక్షిణ దిగ్భాగే శ్రీశైలస్య ఈశాన్య ప్రదేశే (మనకు శ్రీశైలము ప్రధాన క్షేత్రము కావున మనము శ్రీశైలమునకు ఏ దిక్కున ఉన్నామో ఆ దిక్కు చెప్పుకొనవలెను), కృష్ణా గోదావర్యోః మధ్యప్రదేశే (మనం ఏఏ నదులకు మధ్యన ఉన్నామో ఆయా నదుల పేర్లు చెప్పుకొనవలెను), శోభన గృహే (అద్దె ఇల్లు అయినచో వసతిగృహే అనియు, సొంత ఇల్లయినచో స్వగృహే అనియు చెప్పుకొనవలెను), సమస్తదేవతా బ్రాహ్మణ హరిహర సన్నిధౌ అస్మిన్ వర్తమానే వ్యావహారిక చాంద్రమానేన ....సంవత్సరే,

(ఇక్కడ తెలుగు సంవత్సరమను అంటే పూజ చేయునపుడు ఏ సంవత్సరము జరుగుచున్నదో ఆ సంవత్సరము యొక్క పేరును చెప్పుకోవలెను), ...అయనే, (సంవత్సరమునకు రెండు అయనములు-ఉత్తరాయణము, దక్షిణాయనము. జనవరి 15 మకర సంక్రమణం మొదలు జూలై 14 కర్కాటక సంక్రమణం వరకు ఉత్తరాయణము, జూలై 15 కర్కాటక సంక్రమణం నుండి మరల జనవరి 14 పెద్దపండుగ అనగా మకర సంక్రమణం వరకు దక్షిణాయనం. పూజచేయునపుడు ఏ అయనము జరుగుచున్నదో దానిని చెప్పవలెను) ...... ఋతుః, (వసంత, గ్రీష్మ, వర్ష మొ॥ ఋతువులలో పూజ సమయములో జరుగుచున్న ఋతువు పేరు) ....మాసే, (చైత్ర, వైశాఖ మొ॥ పన్నెండు మాసములలో పూజ సమయములో జరుగుచున్న మాసం పేరు) .....పక్షే, (నెలకు రెండు పక్షములు పౌర్ణమికి ముందు శుక్లపక్షము, అమావాస్యకు ముందు కృష్ణపక్షములు వీటిలో పూజ జరుగుచున్న సమయమున గల పక్షము పేరు) .....తిథౌ, (ఆరోజు తిథి) ....వాసరే (ఆరోజు ఏ వారమనదీ చెప్పుకొని) శుభనక్షత్రే, శుభయోగే, శుభకరణే ఏవం గుణ విశేషణ విశిష్టాయాం శుభతిథౌ మమ ఉపాత్త సమస్త దురితక్షయద్వారా శ్రీత్రినాథ ముద్దిశ్య శ్రీత్రినాథ ప్రీత్యర్థం పురుషులైనచో శ్రీమాన్ .... గోత్రస్య..... నామధేయః, శ్రీమత్యః, గోత్రస్య, నామధేయస్య అనియు, స్త్రీలైనచో శ్రీమతి, గోత్రవతి, నామధేయవతి,శ్రీమత్యాః, గోత్రవత్యాః, నామధేయవత్యాః అనియు (పూజచేయువారి గోత్రము, నామము చెప్పి) నామధేయస్యః ధర్మపత్నీ సమేతస్య (పురుషులైనచో) మమ సహకుటుంబస్య, క్షేమ స్థైర్య వీర్య విజయ అభయ ఆయురారోగ్య ఐశ్వర్యాభివృద్ధ్యర్థం, ధర్మార్థ కామ మోక్ష ఫలపురుషార్థ సిద్ధ్యర్థం, పుత్రపౌత్రాభి వృద్ధ్యర్థం సకలవిధ మనోవాంఛాఫలసిద్ధ్యర్థం, శ్రీ త్రినాథ ముద్దిశ్య త్రినాథ ప్రీత్యర్థం (ఏ దేవుని పూజించుచున్నామో ఆ దేవునియొక్క పేరు చెప్పుకొని) సంభవద్భిరుపచారైః సంభవతానియమేన సంభవతా ప్రకారేణ యావచ్ఛక్తి (నాకు తోచిన రీతిలో, నాకు తోచిన నియమములతో, నాకు తోచిన విధముగా, భక్తి శ్రద్ధలతో సమర్పించుకొంటున్న పూజ) ధ్యానావాహనాది షోడశోపచార పూజాం కరిష్యే. తదంగ కలశపూజాం కరిష్యే ॥ పిదప కలశారాధనను చేయవలెను.

కలశపూజను గూర్చిన వివరణ :

వెండి, రాగి, లేక కంచు గ్లాసులు (లేదా పంచపాత్రలు) రెండింటిలో శుద్ధ జలమును తీసుకొని ఒకదానియందు ఉద్ధరిణిని, రెండవదానియందు అక్షతలు, తమలపాకు,

పువ్వు ఉంచుకొనవలెను. రెండవపాత్రకు బయట మూడు వైపులా గంధమును వ్రాసి కుంకమను అద్దవలెను.ఇట్లు చేయునపుడు గ్లాసును గుండ్రముగా త్రిప్పుచూ గంధమును గాని, కుంకుమనుగాని పూయరాదు. గంధమును ఉంగరపు వేలితో పూయవలెను. కుంకుమ అక్షతలు వగైరా బొటన, మధ్య, ఉంగరపు వ్రేళ్లను కలిపి సమర్పించవలెను. యజమానులు (ఒక్క రైతే ఒకరు, దంపతులైతే ఇద్దరూను) ఆ కలశాన్ని కుడిచేతితో మూసివుంచి, ఇలా అనుకోవాలి. ఈ విధముగా కలశమును తయారుచేసి పూజను చేయునపుడు మొదటగా ఈ శ్లోకమును చదువవలెను.

మం॥కలశస్య ముఖే విష్ణుః కంఠే రుద్రస్సమాశ్రితః

మూలే తత్ర స్థితో బ్రహ్మామధ్యేమాతృ గణాస్మృతాః ॥

ఋగ్వేదో థ యజుర్వేదస్సామవేదోహ్యధర్వణః

అంగైశ్చ సహితాస్సర్వే కలశాంబు సమాశ్రితాః

శ్లో॥గంగైచ యమునేచైవ కృష్ణే, గోదావరి, సరస్వతీ, నర్మదా సింధు

కావేర్యా జలేస్మిన్ సన్నిధిం కురు ॥

ఇక్కడ ఇలా శ్లోకము ముగిసిన తరువాత ఆయాతు శ్రీత్రినాథ. (ఏ దేవుని పూజైతే చేస్తున్నామో ఆ దేవుని పేరును చెప్పవలెను) పూజార్థం మమ దురితక్షయకారకాః కలశోదకేన ఓం దేవం సంప్రోక్ష్య (కలశమందలి ఉదకమును దేవునిపై చల్లాలి), ఓం ఆత్మానం సంప్రోక్ష్య అని (ఆ నీటిని తనపై చల్లుకోవాలి) ఓం పూజా ద్రవ్యాణి సంప్రోక్ష్య (పూజాద్రవ్యములపై కూడా చల్లాలి) కలశమందలి నీటిని పై మంత్రం చదువుతూ పువ్వుతోగాని, ఆకుతోగానీ చల్లాలి.

మార్జనము :

ఓం అపవిత్రః పవిత్రోవా సర్వావస్థాంగతోపివా

యస్స్మరే త్పుండరీకాక్షం సబాహ్యాభ్యంతరశ్శుచిః ॥

అని పిదప కాసిని అక్షతలు, పసుపు, గణపతిపై వేసి, ఆయనను తాకి నమస్కరించి ప్రాణప్రతిష్ఠాపన చేయవలెను. ప్రాణప్రతిష్ఠ అనగా శ్రీ మహా గణాధిపతయేనమః ప్రాణప్రతిష్ఠాపన ముహూర్తస్సుముహూర్తోస్తు తథాస్తు. తరువాత ఇలా చదువుతూ విఘ్నేశ్వరునికి నమస్కరించవలెను.

శ్లో॥ శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్
ప్రసన్నవదనం ధ్యాయే త్సర్వవిఘ్నోపశాంతయే ॥
సుముఖశ్చైక దంతశ్చ కపిలో గజకర్ణకః
లంబోదరశ్చ వికటో విఘ్నరాజో వినాయకః
ధూమకేతు ర్గణాధ్యక్షః ఫాలచంద్రో గజాననః
వక్రతుండ శ్శూర్పకర్ణో హేరంబః స్కంధపూర్వజః
షోడశైతాని నామాని యఃపఠేచ్ఛృణుయాదపి
విద్యారంభే వివాహేచ ప్రవేశే నిర్గమే తథా
సంగ్రామే సర్వకార్యేషు విఘ్నస్తస్య నజాయతే ॥

పిదప షోడశోపచార పూజను చేయవలెను. షోడశోపచారములనగా ఆవాహన, ఆసనం, అర్ఘ్యం, పాద్యం, ఆచమనీయం, స్నానం, వస్త్రం, యజ్ఞోపవీతం, గంధం, పుష్పం, ధూపం, దీపం, నైవేద్యం, తాంబూలం, నమస్కారం, ప్రదక్షిణములు మొదలగునవి.

పిదప షోడశోపచార పూజను చేయవలెను. షోడశోపచారములనగా ధ్యాన, ఆవాహన, ఆసనం, అర్ఘ్యం, పాద్యం, ఆచమనీయం, స్నానం, వస్త్రం, యజ్ఞోపవీతం, గంధం, పుష్పం,ధూపం,దీపం,నైవేద్యం, తాంబూలం, నమస్కార ప్రదక్షిణములు మొదలగునవి.

షోడశోపచార పూజా ప్రారంభః

ధ్యానం :

శ్లో॥ఓం శ్రీ త్రినాథ నమః ధ్యాయామి - ధ్యానం సమర్పయామి

అని త్రినాథుని మనస్సున ధ్యానించి నమస్కరించవలెను.

ఆవాహనం :

శ్లో॥ఓం శ్రీ త్రినాథ నమః ఆవాహయామి. ఆవాహనార్థం అక్షతాం సమర్పయామి.

అనగా మనస్ఫూర్తిగా దేవుని మన ఇంట్లోకి ఆహ్వానించడం. అట్లు మనస్సున స్మరిస్తూ అక్షతలు దేవునిపై వేయవలెను.

ఆసనం :

శ్లో॥ఓం శ్రీ త్రినాథ నమః నవరత్న ఖచిత సింహాసనం సమర్పయామి.సింహాసనార్థం అక్షతాం సమర్పయామి. దేవుడు కూర్చుండుటకై మంచి బంగరుపీట వేసినట్లు అనుకుంటూ అక్షతలు వేయవలెను.

అర్ఘ్యం :

శ్లో॥ఓం శ్రీ త్రినాథ నమః హస్తౌః అర్ఘ్యం సమర్పయామి.

దేవుడు చేతులు కడుగుకొనుటకై నీళ్ళిస్తున్నామని మనసున తలుస్తూ, ఉద్ధరిణితో నీరు వేరొక గిన్నెలో వదలవలయును.

పాద్యం :

శ్లో॥ఓం శ్రీ త్రినాథ నమః పాదౌః పాద్యం సమర్పయామి.

దేవుడు కాళ్లు కడుగుకొనుటకు నీరు ఇస్తున్నామని మనసున అనుకుంటూ పువ్వుతో పంచపాత్రలోని నీరు అదే గిన్నెలో ఉద్ధరిణెతో వదలవలెను.

ఆచమనీయం :

శ్లో॥ఓం శ్రీ త్రినాథ నమః ఆచమనీయం సమర్పయామి.

అంటూ దేవుని ముఖము కడుగుకొనుటకై నీళ్ళిస్తున్నామని మనమున తలుస్తూ పైన చెప్పిన పాత్రలో ఉద్ధరిణెతో ఒకమారు నీరు వదలవలెను.

సూచన :

అర్ఘ్యం, పాద్యం, ఆచమనం మొదలగు వాటికి ఉద్ధరిణెతో నీరు వేరొక పాత్రలో వదలవలెను. అరివేణం (పంచపాత్రకు క్రిందనుంచు పళ్లెము) లో వదలరాదు.

మధుపర్కం :

శ్లో॥ఓం శ్రీ త్రినాథ నమః మధుపర్కం సమర్పయామి

అనిస్వామివారికిస్నానంచేయుటకువస్త్రమిచ్చుచున్నామనితలుస్తూ, ఈ మధుపర్కంను ఆయన ప్రతిమకు అద్దవలెను.(ప్రత్తిని పెద్దబొట్టుబిళ్ళ సైజులో గుండ్రముగా చేసి నీటిలో తడిపి ఆపైన రెండువైపులా పసుపులో అద్ది ఉంచుకొన్నదాన్ని మధుపర్కం అంటారు).

పంచామృతస్నానం :

శ్లో॥ఓం శ్రీ త్రినాథ నమః పంచామృత స్నానం సమర్పయామిఅని స్నానమునకు పంచామృతములతో కూడిన నీరు ఇచ్చునట్లు భావించి ఆవునెయ్యి, ఆవుపాలు, ఆవు పెరుగు, తేనె, పంచదార కలిపిన పంచామృతమును స్వామిపై ఉద్ధరిణెతోచల్లవలెను.

శుద్ధోదక స్నానం :

శ్లో॥ఓం శ్రీ త్రినాథ నమః శుద్ధోదకస్నానం సమర్పయామి.

పంచపాత్రలోని శుద్ధ నీటిని పువ్వుతో దేవునిపై చల్లవలెను.

తరువాత అష్టోత్తర శతనామావాళి పూజ. దీనియందు 108 మంత్రములుండును. ఈ మంత్రములను చదువుచు పుష్పములతోగాని, పసుపు కుంకుమలతోగాని స్వామిని పూజించవలెను.

ఓం భూతాత్మనే నమః
ఓం అవ్యయాయ నమః
ఓం పురుషాయ నమః
ఓం పరమాత్మాయ నమః
ఓం బలాయ నమః
ఓం భూతకృతే నమః
ఓం శర్వాయ నమః
ఓం ముకుందాయ నమః
ఓం అమేయాత్మనే నమః
ఓం శుభప్రదాయ నమః 10
ఓం కృతయే నమః
ఓం పాపనాశాయ నమః
ఓం తేజసే నమః
ఓం గణపతయే నమః
ఓం యోగాయ నమః
ఓం దీర్ఘాయ నమః
ఓం సుతీర్థాయ నమః
ఓం విఘ్నే నమః
ఓం ప్రాణదాయ నమః
ఓం మధువే నమః 20
ఓం పునర్వసవే నమః
ఓం మాధవాయ నమః
ఓం మహాదేవాయ నమః
ఓం సిద్ధయే నమః
ఓం శ్రీబలాయ నమః
ఓం నవనాయకాయ నమః
ఓం హంసాయ నమః
ఓం బలినే నమః
ఓం బలాయ నమః
ఓం అనందదాయ నమః 30
ఓం గురవే నమః
ఓం ఆగమాయ నమః
ఓం అనలాయ నమః
ఓం బుద్ధవే నమః
ఓం పద్మనాభాయ నమః
ఓం సుఫలాయ నమః
ఓం జ్ఞానదాయ నమః
ఓం జ్ఞానినే నమః
ఓం శశిబింద్వాయ నమః
ఓం పవనాయ నమః 40
ఓం ఖగాయ నమః
ఓం సర్వవ్యాపినే నమః
ఓం రామాయ నమః
ఓం నిధియే నమః
ఓం సూర్యాయ నమః
ఓం ధన్వినే నమః
ఓం అనాదినిధనాయ నమః
ఓం పవిత్రాయ నమః
ఓం అణిమాయ నమః
ఓం పవిత్రే నమః 50
ఓం విక్రమాయ నమః

ఓం త్రిమూర్తి స్వరూప నమః

ఓం శ్రీతినాథదేవాయ నమః పిదప అగరువత్తిని వెలిగించి

ధూపం :

శ్లో॥ఓం శ్రీత్రినాథ నమః ధూప మాఘ్రాపయామి.

ధూపం సమర్పయామి. అంటూ ఎడమచేత్తో గంట వాయిస్తూ కుడిచేత్తో అగరుబత్తిని తిప్పుతూ పొగను స్వామికి చూపవలెను.

దీపం:

శ్లో॥ఓం శ్రీత్రినాథ నమః సాక్షాత్ దీపం దర్శయామి

అని మొదట్లో చెప్పిన విధంగా దీపారాధనలో వున్న అదనపు వత్తులలో ఒకదానిని తీసుకొని హారతి వెలిగించే దాంట్లో వేసి వెలిగించి గంట మ్రోగిస్తూ ఆ దీపం స్వామికి చూపుతూ పై శ్లోకమునుచదువవలెను.

నైవేద్యం:

శ్లో॥ఓం శ్రీత్రినాథనైవేద్యం సమర్పయామి అని ఒక బెల్లం ముక్క, పళ్ళు, కొబ్బరికాయ మొదలగునవి ఒక పళ్లెములోనికి తీసుకొని స్వామివద్దనుంచి దానిపై పువ్వుతో నీళ్లు చల్లుతూ ఎడమచేత్తో గంటవాయిస్తూ 'ఓం భూర్భువ స్సువః ఓం తత్ సవితుర్వరేణ్యం భర్గో దేవస్య ధీమహి, ధియోయోనః ప్రచోదయాత్, సత్యం త్వ ర్తేన పరిషించామి, (ఋతంత్వాసత్యేతపరిషించామిఅనిరాత్రిచెప్పవలెను)అమృతమస్తుఅమృతోపస్తరణమసి, ఓం ప్రాణాయస్వాహా, ఓం అపానాయ స్వాహా, ఓం వ్యానాయ స్వాహా, ఓం ఉదానాయ స్వాహా, ఓం సమానాయ స్వాహా, మధ్యేమధ్యే పానీయం సమర్పయామి అంటూ ఆరుమార్లు చేతితో (చేతిలోని ఉద్ధరిణెతో) స్వామికి నివేదనం చూపించాలి. పిదప ఓం శ్రీ నమః నైవేద్యానంతరం 'హస్తౌ ప్రక్షాళయామి'అని ఉద్ధరిణెతో పంచపాత్రలోని నీరు ముందు చెప్పిన అర్ఘ్యపాత్ర (పంచపాత్ర కాకుండా విడిగా చెంబులో పెట్టుకొనే నీళ్ల పాత్ర) లో వదలాలి. తరువాత 'పాదౌప్రక్షాళయామి'అని మరోసారి నీరు అర్ఘ్య పాత్రలో ఉద్ధరిణెతో వదలాలి. పునః శుద్ధాచమనీయం సమర్పయామి అని ఇంకొక పర్యాయం నీరు వదలాలి తదనంతరం

తాంబూలం:

శ్లో॥ఓం శ్రీత్రినాథనమః తాంబూలం సమర్పయామి అని చెబుతూ తాంబూలమును (మూడు తమలపాకులు, రెండు పోకచెక్కలు, అరటిపండు వేసి) స్వామివద్ద ఉంచాలి. తాంబూలం వేసుకున్నాక నోరు కడుక్కొనుటకు నీరు ఇస్తున్నామని తలుస్తూ, 'తాంబూల చరవణానంతరం శుద్ధ ఆచమనీయం సమర్పయామి'అంటూ ఉద్ధరిణెతో నీరు అర్ఘ్యపాత్రలో వదలాలి. పిమ్మట కర్పూరం వెలిగించి

నీరాజనం:

శ్లో॥ఓం శ్రీ త్రినాథ నమః కర్పూర నీరాజనం సమర్పయామి

అని కర్పూర బిళ్ళలు హారతి కుందిలో వేసి ముందుగా దీపారాధనకు వెలిగించిన దీపంతో వెలిగించి, మూడుమార్లు త్రిప్పుచూ, చిన్నగా ఘంట వాయించవలెను. అనంతరం మళ్లీపువ్వుతోనీరుహారతికుందిచివర వదులుతూ ' కర్పూర నీరాజనానంతరం శుద్ధాచమనీయం సమర్పయామి ' అని చెప్పి నీరాజనం స్వామివారికి చూపించి తరువాత ఇంటిలోని వారందరూ హారతిని కళ్ళకు అద్దుకోవాలి.తరువాత అక్షతలు, పువ్వులు, చిల్లర డబ్బులు చేతితో పట్టుకొని,

మంత్రపుష్పం :

శ్లో॥ఓం శ్రీ త్రినాథ నమః యథాశక్తి మంత్రపుష్పం సమర్పయామి

అని చెప్పుకొని అక్షతలు, పువ్వులు, చిల్లర స్వామివద్ద ఉంచవలెను. పిమ్మట ఈ దిగువ మంత్రం జపిస్తూ మూడుసార్లు ప్రదక్షిణలు చేయాలి.

ప్రదక్షిణం :

శ్లో॥ ప్రదక్షిణం కరిష్యామి సతతం మోదకప్రియ,
నమస్తే విఘ్న రాజాయ నమస్తే విఘ్ననాశన ॥

శ్లో॥ ప్రమధగణ దేవేశ ప్రసిద్ధే గణనాయక,
ప్రదక్షిణం కరోమి త్వా మీశపుత్ర నమోస్తుతే ॥

శ్లో॥ యానికానిచ పాపాని జన్మాంతర కృతానిచ
తానితాని ప్రణశ్యంతి ప్రదక్షిణ పదేపదే ॥

శ్లో॥ యానికానిచ పాపాని జన్మాంతర కృతానిచ
తానితాని ప్రణశ్యంతి ప్రదక్షిణ పదేపదే ॥

ఓం శ్రీ త్రినాథ నమః ఆత్మ ప్రదక్షిణ నమస్కారాన్ సమర్పయామి. శ్రీ స్వామికి చేతిలో అక్షతలు, పువ్వులు తీసుకొని లేచి నిలబడి మూడు సార్లు ఆత్మప్రదక్షిణ చేసి (అనగా తమలో తాము చుట్టూ తిరిగి) పిమ్మట సాష్టాంగ నమస్కారం చేసి(మగవారు పూర్తిగా పడుకుని తలను నేలకు ఆన్చి, ఆడువారు మోకాళ్లపై పడుకుని కుడికాలు ఎడమకాలుపై వేసి) తరువాత స్వామిపై చేతిలోనున్న అక్షతలు, పువ్వులు చల్లి మరల తమ స్థానమున ఆసీనులై నమస్కరించుచూ

పునఃపూజ :

ఓంత్రినాథ నమః పునఃపూజాంచ కరిష్యే అని చెప్పుకొని, పంచపాత్రలోని నీటిని చేతితో తాకి, అక్షతలు స్వామిపై చల్లుతూ ఈక్రింది మంత్రములు చదువుకొనవలెను.

విశేషోపచారములు :

ఛత్రం ఆచ్ఛాదయామి, చామరం వీజయామి, నృత్యం దర్శయామి, గీతం శ్రావయామి, వాద్యం ఘోషయామి, సమస్త రాజోపచార, శక్త్యోపచార, భక్త్యోపచార పూజాం సమర్పయామి అనుకొని, నమస్కరిస్తూ ఈక్రింది శ్లోకమును చదువుకొనవలెను.

పూజాఫల సమర్పణమ్ :

శ్లో॥ యస్యస్మృత్యాచ నామోక్త్యా తపం పూజా క్రియాదిషు
యానసంపూరతాంయాతి సద్యోవందే తమచ్యుతమ్
మంత్రహీనం క్రియాహీనం భక్తిహీనం మహేశ్వర ।
యత్పూజితం మయా దేవ పరిపూర్ణం తదస్తుతే ॥

అనయా ధ్యానావాహనాది షోడశోపచార పూజయాచ భగవాన్ సర్వాత్మకః శ్రీత్రినాథసు ప్రీత స్సుప్రసన్నో వరదో భవతు.ఏతత్ఫలం శ్రీత్రినాథ ర్పణమస్తు అంటూ అక్షతలు నీటితోపాటుఅరవేణంలోవదలవలెను.పిమ్మట'శ్రీత్రినాథప్రసాదం శిరసాగృహ్ణామి' అనుకొని స్వామివద్ద అక్షతలు తీసుకొని తమ తమ తలలపై వేసుకొనవలెను. ఆ పిదప పసుపు గణపతి ఉన్న పళ్లెము నొకసారి పైకి ఎత్తి తిరిగి క్రింద ఉంచి పళ్లెములో ఉన్న పసుపు గణపతిని తీసి దేవుని పీఠముపై నుంచవలెను. దీనిని ఉద్వాసన చెప్పటం అంటారు. ఓం శ్రీగణపతినమః యధాస్థానం ప్రవేశయామి.
శోభనార్థం పునరాగమనాయచ అని ఉద్వాసన పలుకుతారు.

పూజావిధానం సంపూర్ణమ్.

తీర్థ ప్రాశనమ్ :

శ్లో॥ అకాల మృత్యుహరణం సర్వవ్యాధి నివారణమ్ ।
సమస్త పాపక్షయకరం శ్రీ త్రినాథ పాదోదకం పావనం శుభమ్ ॥

అని తీర్థమును చేతిలో వేసుకొని మూడుమార్లు నోటిలోనికి తీసుకొనవలెను.

త్రినాథ వ్రతకథా ప్రారంభము

మధుసూదనుని కథ

భక్తులారా! మనస్సు నిర్మలంతో వినండి. ఈ త్రినాథుల చరిత్రము మాటిమాటికి వినుటకు అమృతము వలెనుండును. శ్రీపురము అను గ్రామమునందు మధుసూదనుడను నొక బ్రాహ్మణుడుండెవాడు. మిక్కిలి దరిద్రుడుఅగుటచే బిక్షమెత్తుకొని జీవించేవాడు.

ఆ బ్రాహ్మణుడనకు ఒక కుమారుడు జన్మించెను. తల్లికి పాలు లేనందున పిల్లవాడు ఎలా బ్రతుకగలడు? పాలు చాలనందున ఆ బాలుని శరీరము దినదినము కృశించుచున్నది. ఆ బాలుడు చిక్కిపోవుచున్నందున ఆ బ్రాహ్మణుని భార్య పెనిమిటితో నిట్లు పలికెను. "అయ్యా! నేను చెప్పెడిమాట శ్రద్ధగా వినండి, మనపిల్వానికి పాలునిమిత్తము పాలుగల ఆవునొకటి తీసుకుండి' అని చెప్పగా, ఆ మాట విని భర్త యేమని చెప్పుచున్నాడంటే ' ఓసీ' నీకు వెర్రి పట్టినదా? మనముచూడగా కడుబీదవారము. పాలు యిచ్చే ఆవు ఏలాగున దొరుకుతుంది? ధనరత్నములు మన వద్దలేవు. నేను లోకంలో ఏ విధంగా గణ్యతపొందుతాను?ఎవరికైతేధనసంపదలుకలిగియుండునో,వారికేలోకమంతామర్యాదలు చేస్తోంది. అట్టివారికే లోకమంతా భయపడతారు. మనవంటి బీదవారిని యెవరు అడుగుతారు' అని బ్రాహ్మణుడు చెప్పెను. భార్యమిగుల దుఃఖించినదై, ఓబ్రహ్మదేవుడా! నీవు మా వంటి బీదవారింటిలో ఈ బిడ్డను యెందుకుపుట్టించినావు? ఏమి తిని యీ బిడ్డ బ్రతుకుతాడు? ఈ శిశుహత్య నాకు చుట్టుకుంటుంది" అని దుఃఖించుచుండగా పిల్లవాని ఘోషచూచి యేమియు తోచక ఆ బ్రాహ్మణుడు చింతాక్రాంతుడై విచారించి, తన యింటిలో ఉండిన కమండలము వగైరా చిల్లర సామానులు సంతలో అమ్మి, ఆ అమ్మిన సొమ్ము అయిదురూపాయలు జాగ్రత్తగా పట్టుకొని వెళ్ళి భార్యచేతికి వ్వగా, ఆమె ఆ సొమ్ము చూచి సంతోషించి, పెనిమిటిని చూచి అయ్యా! యీ సొమ్మును తీసుకువెళ్లి పాలిచ్చే ఆవును కొని తీసుకురండిని చెప్పినది.

అట్లు భార్య చెప్పిన మాటలు ప్రకారముఆ బ్రాహ్మణుడు ఆ రూపాయలు పట్టుకొని గ్రామగ్రామముతిరిగెను.ఇట్లుతిరుగుచు,పెద్దభాగ్యవంతుడగుషావుకారుండేగ్రామమునకు వెళ్లేడు. ధనధాన్యాలు పరిపూర్ణమై కుబేరునితో ఆ షావుకారు సరిసమానముగా ఉన్నాడు. అతని ఆవులన్నియు పాలతో నిండియున్నవి. దైవఘటన మాత్రం మరోవిధముగా యున్నది. తన అవులలో 'బోదా' అనే ఆవు వుండెను. అది మిగుల దుష్టబుద్ధి గలది. బైటకు మేతకు వెళ్తే పరుల వ్యవసాయంలో చొరబడి తినివేస్తుంది. ఒక దినమున షావుకారు చూస్తుండగానేపెరవారిపొలంలోనికిచొరబడిపండినపంటతినివేయుచుండెను. అదిచూచి షావుకారు అతికోపంతో యేమనుచున్నాడంటే" ఇంక దీనిముఖము చూడకూడదు.ఆవునుయిప్పుడేఅమ్మి వేస్తాను.ఇది50రూ॥లుఅయినప్పటికీనాకుమంజూరు లేదు యిప్పుడు బేరము వచ్చినచో అయిదు రూపాయలకే యిచ్చి వేస్తాను" అనేసరికి మదుసూదనుడనే బ్రాహ్మణుడు ఆ మాటలు విని షావుకారుతో యిట్లనెను. "షావుకారూ! వినండి 50 రూపాయలు ఖరీదుగల ఆవు అయినప్పటికి అందువల్ల మీకుమంజూరు లేదు. ఆ 5 రూపాయలు నేనే యిస్తాను. ఆవూ దూడ రెండునూ నాకు యిప్పించండి" అని అనగానే " ఓ బ్రాహ్మణుడా! నీకు వెఱ్ఱి పట్టినదా" అని షావుకారు అనెను. అంత బ్రాహ్మణుడు "మీరు షావుకార్లయి ఉన్నారు. మీ మాట మీరు నిలుపుకోండి మాటతప్పితే మీరు అసత్యవంతులౌతారు" అని అన్నాడు. ఆ బ్రాహ్మణుడన్న మాటలు షావుకారు విని, తన మదిలో విచారించి తెలియక అని వేసినాను. ఈ బ్రాహ్మణుడు ఎక్కడనుండి వింటున్నాడో. ఈ ఆవును అతనికివ్వకపోతే నాకు అసత్యము ప్రాప్తించును కదా! అని బ్రాహ్మణుని చూచి చెయ్యిచాచినాడు. వెంటనే సొమ్ము పుచ్చుకుని ఆవును, దూడను బ్రాహ్మణునకు షావుకారు ఇచ్చి వేసినాడు. ఆ యావును చూడగానే బ్రహ్మణ స్త్రీ చంద్రుని చూచిన కలువవలె సంతోషపడెను. వెంటనే పాలు పితికి కుమారునికి పోసి ఆనందము పొందినది. ఇట్లు కొన్ని దినములు గడిచిన తరువాత ఆవు యెటు పోయినదో కనిపించలేదు. ప్రొద్దుపోయెడి వేళయినది. ఆవు రాకపోవడము చూచి బ్రాహ్మణుడు వెదకబోయినాడు. వీధుల్లోను, సమీపమున నున్న వ్యవసాయ భూముల్లోను చూచెను. ఆవు కనపించలేదు. తెల్వారగానే నిద్రమేల్కొని ఆవును వెదకుటకై బయలుదేరి కొంతదూరము నడచి వెళ్లి తోటలో నొక చెట్టును చూచినాడు.

మధుసూదనునకు త్రినాథదేవులు దర్శనమిచ్చుట :

అది ఒక గొప్పమర్రిచెట్టు, పైన ముగ్గురు మనుష్యులు కూర్చుని వున్నారు. వారు వరుసగా బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల. వారే త్రిమూర్తులు. అటువంటి చెట్టు క్రింద బ్రాహ్మణుడు కూర్చొని ఆయాసము తీర్చుకొని, లేచిపోవుచుండగా, త్రిమూర్తులు బ్రహ్మణునితో 'ఓ విప్రుడా! నీ మనస్సుకు యెందు చేత దుఃఖము కలిగినది? నీవు యెక్కడికి వెళ్ళుచున్నావు? ఆ సంగతి మాతో చెప్పు" మనగా బ్రాహ్మణుడు చేతులు జోడించి "అయ్యా! నేను కడు బీదవాడను. భిక్ష మెత్తుకొని బ్రతికేవాడను నాకు ఒక ఆవు వున్నది. అది కనపించుటలేదు. ఈ దినము శ్రీపురము సంత అగుచున్నది. ఆ సంతకు వెళ్ళి వెతికెదను. ఎవరయినా దొంగిలించి తీసుకొనిపోయి నట్టయిన ఆ సంతలోనే అమ్ముతారు గదా! త్రినాథస్వాములారా! ఈ వుద్దేశ్యముతోనే నేను వెతుక్కుంటూ వెళ్ళుచున్నాను". అని తన సంగతి చెప్పెను.

అది విని బ్రాహ్మణునకు త్రిమూర్తులు యేమి చెప్పుచున్నారంటే " నీ వెలాగూ సంతకు వెళ్ళుచున్నావు కనుక, మా నిమిత్తు యేమన్నా కొన్ని దినుసులు తీసుకురావలెను. అని త్రిమూర్తులు అన్నారు అంత బ్రాహ్మణుడు " యేమి దినుసులు కావాలని అడుగగా త్రిమూర్తులు యిట్లనిరి. ఒక్క పైసా ఆకుచెక్క, ఒక్క పైసా నూనె మాత్రము తెచ్చి ఇమ్మని చెప్పిరి. ఆ మాటలు విని బ్రాహ్మణుడు యేమని చెప్పుచున్నాడంటే " ఓ త్రిమూర్తులారా !నాకుపైసాలుయెక్కడదొరుకును?నేనుబీదవాడనుగదా?భిక్షమెత్తుకుని జీవించుచున్నాను" అని అనగా, త్రిమూర్తులు యేమి చెప్పుచున్నారంటె " ఓ బ్రాహ్మణుడా! విను, అదిగో ఆ గోరంటు పొద కనిపించుచున్నదిగదా! దాని మొదట మూడు పైసాలున్నవి"

ఆ మాటలు విని బ్రాహ్మణుడువెళ్ళి ఆ గోరంటు గడ్డి మొదలు పైకి లాగేసరికి మూడు పైసాలు దొరికినవి. ఇంకా ఉండునేమోనని ఆ చెట్టు నింకను పైకిలాగుచుండెను. అది చూచి త్రినాథులవారు "బ్రాహ్మణుడా! నీకు వెర్రి పట్టినదా? అందులో పైసలు యింక లేవు. ఎంతదొరకినదో అంతే యుండును". అని అన్నారు.ఆ మాటలు బ్రాహ్మణుడు విని, అచటనుండి వెళ్ళిపోయెను. కొంతదూరం వెళ్ళి తిరిగి వచ్చి ఆ చెట్టుక్రింద నిలిచి చేతులు జోడించగా త్రినాథులు యిట్లు పలికిరి. " ఓ విప్రుడా! తిరిగి యెందుకొచ్చా" వనగా అయ్యా మీరు చెప్పిన వస్తువులు నేను యెలాగున తెస్తాను అని ప్రశ్నించగా నీపైమీద గావంచాలో తెమ్మని త్రినాథులన్నారు.

అందులకా బ్రాహ్మణుడు గావంచాలో నూనె యెలా వుంటుంది? మీరు జగత్కర్తలు, నాతో కపటంగా చెబుతున్నారు అని అనగా "ఓయీ! నీతో కపటంగా చెప్పలేదు. మమ్ము తలచుకొని నూనె గావంచాలో పోసి తీసుకురమ్మని చెప్పగా ఆ బ్రాహ్మణుడు శ్రీపురం సంతలో ప్రవేశించినాడు. వెళ్ళి చూడగా తన ఆవు కనిపించలేదు. త్రినాథుల కరుణచే పైసంచెలో నూనె నిలచుటఆకులు వక్కలు, గంజాయి తీసుకొని, నూనెకోసం బజారు వెళ్ళి తెలికలవానితో 'ఒక్క పైసా నూనె ఈ గావంచలో పోయ మన్నాడు అందులకా తెలకలవాడు ఆశ్చర్యపడి, ' ఈ బ్రాహ్మణుడు పిచ్చివాడుకాబోలని నూనె లేదు. అని చెప్పినాడు. అక్కడినుండి వెళ్ళి ఒక ముసిలి తెలికల వానిని నూనె అడిగినాడు. అంత ముసలివాడు "దిగుమట్టు నూనె యెంతటిది కావాలని అడుగగా ఒక్క పైసా నూనె మాత్రమిమ్మని బ్రాహ్మణుడు గావంచా చూపినాడు తెలికలవాడు "

ఈ బ్రాహ్మణుడు వికారపువాడు కాబోలు! వీనిని మోసము చేసి పైసాలు తీసుకుంటాను" అని ఆలోచించి కొలత సాత్ర తిరగవేసినూనె కొలత వేసి యిచ్చినాడు. విప్రుడు గావంచా కొన చెంగుపట్టుకొని ఆచట నుండి వెళ్ళిపోయినాడు. అంతియే, తెలికలవాని కుండలో నూనె కొంచెమైననూ లేకుండాపోయినది. అదిచూచి తెలికలవాడు మూర్చపోయినాడు. తెలికల వాళ్లందరూ పరిగెత్తుకు వచ్చి ముసలివాని ముఖముపై నీళ్లు చల్లి, సేదతీర్చి కూర్చుండబెట్టినారు. ఏమి చెప్పుదును? ఎక్కడనుంచో ఒక బ్రాహ్మణుడు వచ్చి గిద్దెడు నూనె కొన్నాడు. ఇప్పుడిట్లు వెళ్లినాడు. కుండలో చూడగానే నూనెలేదని చెప్పగా అందరూ విచారించినారు. ఆ విప్రుడుమా వద్దకువచ్చి మమ్ముకూడా నూనె అడిగినాడు. లేదని అనగా వెళ్ళిపోయినాడు. ఈ లాగున అందరూ విచారించి పరుగెత్తుకొని విప్రుని వద్దకు వెళ్లి ఇలా అన్నారు. "విప్రుడా! విను. మీరు నూనె కొన్నారు గదా! అది కొలతకు తక్కువగా యున్నది. పూర్తిగా యిచ్చివేస్తాము. పట్టుకొని వెళ్ళండి" అన్నారు. మళ్ళీ విప్రుడు సంతకు వెళ్ళాడు. ఈసారి, ముందు తెచ్చిన దుత్తతోనే చమురు సరిగా కొలవగా ఎప్పటివలెనే దుత్తభర్తీ లయిపోయినది. అది చూచి ముసలి తెలికలవాని ఆనందము చెప్పనలవి కాపోయినది. విప్రుని గావంచాలో చమురు వుంచినారు. అది పట్టుకొని విప్రుడువెడలిపోయినాడు.త్రిమూర్తులవారికిపైసామానులుయిచ్చివేసి శలవు అడిగినాడు.

త్రినాథుల ఆనపై బ్రాహ్మణుడు మేళా జరుపుట

శలవు అడగగానే త్రిమూర్తులు విప్రునితో ఏమన్నారంటే "ఓయీ! నీ కష్టము చూచి మా మదిలో దయ కలిగినది. ఒకమాట విను. నీవు త్రినాథుల సేవ చేసెదవేని నీ దరిద్రము పటాపంచలై అధిక సంపదలుకల్గుననిత్రినాథులనగాఅది విని "స్వామీ! ఏయేవస్తువులతో మిమ్ములను పూజచేయవలె ననగా త్రినాథులు యిలాగన్నారు. 'ఓ ద్విజుడా! వినుము. మా పూజయు అధిక ద్రవ్యము అక్కరలేదు. కొంచెముతోనే తృప్తి పొందుదుము. ఇప్పుడు నీవు తెచ్చిన మూడు పైసాల సామాగ్రి చాలును. త్రిమూర్తుల పూజా ద్రవ్యములు ఇంతే. మాకు వీనితోనే మేళా చేయుము. మూడు మట్టి చిలుములయందు గంజాయి నలిపి, అందులో నిప్పను ధూపము వేయవలెను. దీప ప్రమిదలు మూడుచేసి అందులో చమురు వేసి, వత్తులు వేసి, అకు చెక్కలు జాగ్రత్తచేసి వుంచి, రాత్రి తొలి జాములో నీ యింటిలోనికి నీస్నేహితులనుపిలిచి పూజా ద్రవ్యములు దెచ్చి అచ్చట వుంచి సకల పదార్థములను స్వాములకు సమర్పించవలెను. అలాగున చేసిన సకల పాపములు నివారించును." అది విని ద్విజుడు పూజ చేయుటకు వుపక్రమించెను. చెట్టు మొదటనే పూజ ఆరంభించి, గంజాయి ముందు తయారు పర్చినాడు. అపుడు త్రిమూర్తులు " నీ గావంచా చెంగు చీరి వత్తులు చేయ మనగా ద్విజుడు చెప్పుచున్నాడు. నేను బీద బ్రాహ్మణుడను. భిక్షమెత్తుకొని దినమును గడుపుకొని కుటుంబపోషణ చేసుకొనుచున్నాను.అన్నవస్త్రములకుబహుకష్ట పడుచున్నాను. దీపము ముట్టించుటకు అగ్గిలేదు.నాగావంచా వత్తులకు ప్రాప్తమైనది నా ఆవు దొంగల పాలైనది. నా కుటుంబము వుపవాసముతో యెదురు చూస్తుంటారు. ఏ బుద్ధితో పూజా చేస్తాను? అని ఏవగించుకొని ద్విజుడు కూర్చున్నాడు. అది చూచి త్రిమూర్తులు " ఓ ద్విజుడా! మదిలో చింతపడకు. నీ ఆవూ పెయ్యా దొరుకుతాయి. నీవు నీకుటుంబము, సౌఖ్యముగా వుంటారు. వస్త్రములు కూడా దొరకునని చెప్పినారు. అంతట బ్రాహ్మణుడు చేతులు జోడించి"స్వాములారా! అటువంటి భాగ్యము నాకెప్పుడు కలుగుతుందో అప్పుడు ఐదు మేళాలు స్వామివారి కిస్తాను. ఈ మాట సత్యమని చెప్పినాడు. దీపము వెలిగించుటకు అగ్గిలేదే! "నేను యేమి చేయగలను? అనగా త్రిమూర్తులు చెప్పుచున్నారు. " ఓ బ్రాహ్మణుడా! నీ రెండు నేత్రములు మూసుకో" వెంటనే బ్రాహ్మణుడు నేత్రములు మూసుకోగా అకస్మాత్తుగా దీపము వెలిగినది.

అది చూచి బ్రాహ్మణుడు అనందించి స్వామికి మేళా సమర్పించినాడు. మేళా యిచ్చివేసిఅనందంతోబ్రాహ్మణుడుచేతులు జోడించి, సాష్టాంగ దండ మొనరించినాడు. త్రినాథులు బ్రాహ్మణుని అనుగ్రహించుటత్రిమూర్తుల వద్ద శలవు పొంది కొంచెము దూరమునడచివెళ్ళుచుండగాత్రోవలోఆవును,దూడనుచూచిసంతోషించి"త్రినాథులవారు నాయందు దయవుంచి ఆవును, పెయ్యను తెచ్చి ఇచ్చినారు. వారి పూజా బాగుగా చేసినాను" అని భావించుకొని ఆవును దూడను తోలుకొని యింటికి చేరినాడు. చూడగా తన యింటిలో సిరిసంపదలు పరిపూర్ణముగా వున్నవి. అదిచూచి అధికముగా సంతోషము పొంది, కడు శ్రద్ధతో పూజ నర్పించినాడు. చేయవలసిన కార్యక్రమముల నందరికీ విశదముగా తెలియపరచినాడు. తన స్నేహితులను రప్పించి వెనుకటివలెనే మేళా సమర్పించినాడు. మేళాచేయు పద్ధతిని అందరికీ చెప్పగా అంతా ఒప్పుకున్నారు. ఆ రాజ్యములో వున్న ప్రజలు అందరూ త్రినాథ పూజ చేసినారు. అందరి ఇండ్లయందు సుఖ సంతోషములు నిండెను. దానివల్ల షావుకార్లందరూ వ్యాపరములుమూసివేసినారు. అందరూ ఆ దేశపు రాజు వద్దకు వెళ్ళి ఫిర్యాదు చేసినారు.

రాజు త్రినాథులను తూలనాడి మేళాను నిషేధించుట

వారిని చూచి రాజు "మీరందరూ యెందుకు వచ్చినారు? అని అడుగగా "అయ్యా మా ఫిర్యాదు మీరు వినవలయును. మధుసూదనుడను పేద బ్రాహ్మణుడు ఒకడు భిక్షమెత్తుకొని జీవించెడివాడు. శ్రీపురము వెళ్ళి వచ్చి త్రినాథమేళాను అచరించినాడు. త్రినాథులు యే దేవతలో? వారిని ఆ బ్రాహ్మణుడు పూజించగానే సకల సంపదలు అతనికి కలిగినవి. ఊరిలో నున్న రైతులు యావన్మందీ త్రినాథ మేళా చేసినారు గ్రుడ్డివారు, కుంటివారు, అందరూ కూడా ఈ మేళా చేసినారు. అందరూ మోక్షమందినారు. ధన ధాన్యాలు కలిగి కుబేరునితో సమానమై పోయినారు. మా వ్యాపరములు పోయినవి. మా క్రయ విక్రయములు యేలాగున జరుగుతాయి!" అని చెప్పగా రాజా మాటలు విని చాలాకోపము తెచ్చుకొని సకల జనులను పిలిపించి కోపముతో ఇట్లన్నాడు "త్రినాథులనే దేవతలు యేమి దేవతలు? వారిని మీరు యేల పూజించుచున్నారు? నేను చెప్పుచున్నానను వినండి. ఆపూజ మీరు చేయకూడదు. అట్లు పూజ యెవరుచేస్తారో వారు ఐదువందల రూపాయలు జరిమానా యిచ్చి ఆరు మాసాలు ఖైదులో వుండవలసింది. అటుల కాని యెడల శూలం వేయబడునని రాజుగారు ప్రజలందరికీ తాఖీదు యిచ్చి పంపినారు.

త్రినాథులు రాజుపై కోపించుట- యువరాజు మరణము

ఈ సంగతి త్రినాథులవారికి తెలిసి ఆ రాజునకు దండన విధించినారు. దాని ఫలితముగా రాజకుమారుడు చనిపోయినాడు. నగరంలో యేడ్పు ఘోష వినిపించుచున్నది. ప్రజలందరు విని రాజువద్దకు పరుగెత్తినారు. రాజు దైవకృప, తప్పడంవల్ల తన కుమారుడు చనిపోయినాడని అనుకుంటున్నాడు. కుమారుని ముఖం చూస్తూ రాజు యేడ్చుచున్నాడు. తల్లి, బంధువులు మొదలగు వారంతా దుఃఖించుచున్నారు. దహనము చేయుటకై స్వర్ణ భద్రానదీతీరమందు ఆ శవము నుంచినారు.

త్రినాథుల దయతో యువరాజు బ్రతుకుట

త్రినాథులకు దయ కలిగినది. "రాజకుమారుని బ్రతికించి వేతుమా! మనకు పేరు ప్రఖ్యాతులు కల్గును." అని బాగుగా ఆలోచించి బ్రాహ్మణరూపంలో ఆ స్మశానమునకు వచ్చినారు. రాజును, వారి సమూహమును చూచి "మీరందరూ ఈ నదీతీరమునకు యెందులకొచ్చినారు? ఏల విచారముగా కూర్చున్నారు. ఈ పిల్లవాడెందుకు పండుకొని యున్నాడు? ఇతని శరీరములో చల్లదనము కలదే? అని అడుగగా అంతా త్రిమూర్తులతో యిలా అన్నారు. " మీతో ఏమి చెప్పగలం.రాజకుమారుడు చనిపోయినాడు. ఆ రాజేమి దోషము చేసెనోగాని, ఈతడు చనిపోయినాడు." అనగా ఈ కుర్రవాడు చనిపోలేదు. త్రినాథులవారికి రాజు అపరాధము చేసినందున ఈ చావు కలిగినది. ఇప్పుడు మీరందరూ త్రినాథులను భజించితే ఈ బాలుడులేచికూర్చుంటాడు.మామేళాచేయుటకు రాజు ఒప్పుకున్నటయితే యీ రాజకుమారుడు బ్రతుకగలడని చెప్పి త్రినాథమూర్తులు అదృశ్యులైనారు. అందరూ వారి మాటలనువిని త్రినాథస్వాములపేరు ఆ రాజతనయుని చెవిలో చెప్పినారు. ఏడు మేళాలు చేయుటకు ఒప్పుకున్నారు. అలా ఒప్పుకోగానే రాజకుమారుడు లేచికూర్చున్నాడు. అది చూచి అందరూ

సంతోషమును పొందినారు. అప్పుడు త్రిమూర్తుల పేరు మాటిమాటికీ స్మరించినారు. అందరినోటినుండి వెలువడిన పలుకులు సముద్ర గర్జనవలె వినిపించినవి.

వర్తకుడు త్రినాథుల మేళా చేయుటకు మ్రొక్కుకొనుట

అటువంటి సమయమున ఒక వర్తకుడు ఆ వూరి మీదుగా తన ఓడలలో విదేశములకు సరుకులనుతీసుకువెళ్ళుచుండెను. ఆ ఓడను నడిపించుకొని స్వర్ణభద్రానదీ తీరమున ప్రవేశించినాడు. ఘోష చేసిన స్థలముదగ్గరకు వెళ్ళినాడు.వారిని చూచి జనులారా! త్రినాథుల పేర్లు యేమి పేర్లు? మీరేల స్మరించుచున్నారు? వినడానికి శ్రద్ధగా ఉన్నవి"

అనగా రాజుగారి మనుష్యులు ఇట్లన్నారు. ఓ వర్తకుడా! వినుము. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు అనేవారు త్రినాథస్వాములు. అటువంటి ప్రభువులను మా రాజుగారు మన్నించనందున అపరాధుడైనాడు. ఆ అపరాధమువలన యీ రాజకుమారుడు చనిపోవుటచే ఇతనిని మేము తీసుకువచ్చి అగ్ని సంస్కారముచేయుటకు కూర్చొని యున్నాము. ఇదిచూచి ప్రభువులకు దయ కలిగెను. వచ్చి వీనిని బ్రతికించినారు. అందుకు యేడు మేళాలు చేయుటకు ఒప్పుకున్నాము. వెంటనే రాజకుమారుడు బ్రతికి కూర్చుండెను. ఈ విధంగా వారు చెప్పగా విని, షావుకారు మదిలో సంతోషించి అటువంటి ప్రభువు లెక్కడుందురో? చనిపోయిన రాకుమారుడు బ్రతికి కూర్చుండెను. నా ఓడలు ఒడ్డున అడ్డుకొని యున్నవి. నేను ఈ ఓడపై వెళ్ళివస్తాను. నాయింటికి సుఖంగా చేరుకుంటాను. నాకు వ్యాపారంలో నష్టము రాకపోయినట్టయిన ప్రభువులవారికి అయిదు మేళాలు చేస్తాను. ఇట్లు మనస్సులో సంకల్పించుకొని ఓడపై కూర్చొని నడిపించుకొని వెళ్ళిపోయినాడు. పై దేశము వెళ్ళి అచ్చట గొప్ప లాభము పొంది తిరిగి వచ్చి ఓడ నడిబొడ్డున లంగరు వేయించి యింటికి వెళ్ళినాడు.

మేళా చేయకపోవుటచే ఓడ మునుగుట

తన నౌకర్లందరూ ఓడలోని ధనము మోసుకొని పోయినారు. ధనమును యింటిలో వేసుకొని షావుకారు సంతోషముతో వున్నాడు. ధనం చూచి ప్రభువులవారి మేళాలు మరచెను. అందుకు ప్రభువులకు కోపము కలిగి దండన చేసినారు. ఓడనీటిలో మునిగిపోయినది. నౌకర్లు, ఓడలోనున్న వారందరూ నీటిలోమునిగిపోయిరి.అది తెలిసి అతనుకూడా భూమిపైపడి గోల పెట్టినాడు.మరికొంతసేపటికి తెలివి తెచ్చుకొని ఏడ్చుచుండగా ఆకాశములోనుండి త్రినాథులు నీవు మాకు మేళాల నిచ్చినావు కావు. అందుచేతనేఓడ మునిగినది. నీవు ఐదు మేళాలు సమర్పించినట్లయిన నీ ఓడ నీకు ప్రాప్తించును. అని సెలవిచ్చినారు. అది విని షావుకారు మదిలో దుఃఖించి ముందు నేను సంకల్పము చేసియుంటిని. ప్రభువుల మహిమను మరచితిని. ఇప్పుడే త్రినాథులవారికి మేళా యిస్తాను. అని మదిలో నిశ్చయించుకొని మేళాకు కావలసిన సామాగ్రితెప్పించి స్నేహితులనురప్పించిప్రభువులవారికిమేళాసమర్పించిప్రార్థించినాడు.నీటిలో మునిగిపోయిన ఓడ వెంటనే పైకి తేలినది. అది చూచి పట్టలేని సంతోషము పొందెను. పరిచారకులు నౌకర్లు,ఓడలో గల మిగిలిన ధనం కొనిపోయినారు.

ధనము మోయించి షావుకారు ఇంటిలో ప్రవేశించెను. గంజాయి. ఆకులు, చెక్కలు అన్నీ స్వామివారికి మేళా సమర్పించి సాష్టాంగ దండప్రణామంబులు చేసినారు. రాజ్యమంతా త్రినాథస్వామిమేళాగురించి ప్రకటనలు పంపించినారు.మేళాను చూచుటకు అంతా వస్తున్నారు.

గ్రుడ్డివానికి చూపు, కుంటివానికి కాళ్ళు వచ్చుట

ఇట్టిస్థితిలో గ్రుడ్డివాడొకడు త్రోవను బోయేవారితో అన్నా మీరెవరు. మీపేరేమిటి? మీరెక్కడకు వెళ్ళుచున్నారు? అనెను. వారు మేళాచూచుట కనిరి. అదివిని గ్రుడ్డివారు నాకు కండ్లు కానారవు. మీరందరూ నేత్రములతో చూస్తారు. నేను దేనితో చూస్తాను. అని అనగా గ్రుడ్డివాడా! త్రినాథస్వామి వారిని భజింపుము. నీ కన్నులు బాగుగా కనబడును. ప్రభువులవారి మహిమచూడవచ్చును.అనిచెప్పి,వారంతా మేళా వద్దకు ప్రవేశించినారు. గ్రుడ్డివాడు ఆ త్రోవలో కూర్చుని స్వామి వారిని భజన చేయుచుండగా కొంచెము కన్నులు కనుపించినవి. అప్పుడు గ్రుడ్డివాడు కొంతదూరము పోయినాడు. దారిలో ఒక పొట్టవాడు కూర్చొని యున్నాడు. వానిని చూచి నీవు గ్రుడ్డివాడివి ఇంత కష్టంతో యెక్కడకు వెళ్ళుచున్నావు. అని అడిగినాడు. గ్రుడ్డివాడు చెప్పుచున్నాడు. అన్నా! నేను మేళాను చూచుటకు వెళ్ళుచున్నాను ఆ మాటలు పొట్టవాడు విని" స్వామివారిదయ నామీద లేదు. చేతులు, కాళ్ళు పొట్ట. నేనెలాగున నడువగలను? నీకు కాళ్ళున్నవి డేక్కొనీ వెళ్ళగలవు, అంతగ్రుడ్డివాడుచెప్పుచున్నాడు."నీవు త్రినాథస్వామి వారిని భజింపుము. నీచేతులు కాళ్ళు బాగౌతవి. క్షణంలో యిద్దరం కలసి వెడలిపోదాము. నేను కేవలం గ్రుడ్డివాడను. ఏమాత్రం కన్నులు కనిపించుటలేదు. త్రినాథస్వామి వారిని భజించినాను కనుక, కొంచెము కనిపిస్తున్నది. అందుచే, నీవుకూడా స్వామివారిని భజించినావంటే నీ బాధలు నివారణ చేస్తారు. అని చెప్పగా పొట్టవాడు త్రినాథా! త్రినాథా! అని భజించినాడు. గ్రుడ్డిఅన్నా! నీకు కాళ్ళున్నవి, నడువగలవు నేను యెలాగు నడువగలను నన్ను నీ భుజము మీద కూర్చోబెట్టుకొన నెమదిగా నడిచివెళ్ళు నేను త్రోవ చూపుతూ ఉంటాను. నిశ్చింతగా ఇద్దరము మేళాకు చేరుకుందాం అని పొట్టవాడు చెపాడు.అతని మాటలు విని గ్రుడ్డివాడు. పొట్టవానిని భుజముపై కూర్చొబెట్టుకుని మెల్లగా నడిచిపోతున్నాడు గ్రుడ్డివాడు చెబుతున్నాడు నేస్తం!

నా నేత్రాలు నిర్మలంగా కనిపించుచున్నవి అని అనగా పొట్టవాడు అయ్యా, నేను ఇప్పుడ నడిచిపోగలను ఈ విధంగా గ్రుడ్డివాడు, పొట్టవాడు కలిసి త్రినాథస్వామి మేళా దగ్గరకు ప్రవేశించినారు.

త్రినాథులు వైష్ణవభక్తుని రక్షించుట, మూర్ఖపు గురువును శిక్షించుట

ఆ మేళా జరుగు స్థలమునకు నిత్యమూ ఒక వైష్ణవుడు వస్తూ వుండేవాడు. అతడు త్రినాథమేళా చెల్లకుండా ఇంటికి యెప్పుడూ వెళ్ళిపోతూ ఉంటాడు. అతనిని ఈ ప్రొద్దు మన స్థానమందు కూర్చుండబెట్టవద్దు అని అనుకుని మేళా చేయువారంతా వైష్ణవుడు రాగానే చూచి మేళాచెల్లించకుండా నీవు వెళ్ళుచున్నావు, కాబట్టి నిన్ను మేళా వద్దకు రాకుండా ఆపుచేయడమైనది. అని చెప్పగా వైష్ణవుడేమి అంటున్నాడనగా నాయనలారా! అపరాథము క్షమించండి. ఇకనుండి మేళాకాకుండా వెళ్ళను నేను నికరముగా చెప్పుచున్నానునా గురువు యిక్కడకు వచ్చినా సరే విడిచి వెళ్ళను దైవయోగమున ఆ క్షణమే గురువు వచ్చి వైష్ణవుని యింటికి వెళ్ళినాడు. నా శిష్యుడు ఎక్కడకు వెళ్ళినాడు? ఆ దినము అతడు ఆగుపించలేదే? మని వైష్ణవుని గురించి అతని తల్లిని అడిగినాడు అప్పుడతనితో యిలాగున చెప్పినది. నాకుమారుడు మేళా వద్దకు వెళ్ళినాడు గురువు మేళాయెవరి దని అడిగినాడు అందులకా ముసలిది అది త్రినాథుని మేళా అని చెప్పినది. ఆ మాటలు విని గురువు అక్కడకు వెళ్ళి చూడగా అంతా స్వామి వారిని భక్తి శ్రద్ధలతో పూజ చేయుచున్నారు. అది చూచి గురువునకు కోపం వచ్చి, బాగా తిట్టి, మేళా స్థలమును సామాగ్రిని కాలితో తన్నివేశాడు. తరువాత వైష్ణవుని పట్టుకొని బరబరా లాక్కుపోయాడు. కొంతదూరము వెళ్ళేసరికి బోరున వర్షము కురియసాగినది. కటిక చీకటి కావడము వలన త్రోవ కన్పించడములేదు. గురుశిష్యులు చెల్లాచెదురై అతి కష్టము మీద గురువుగారి యింటికి చేరుకున్నారు. గురువు యింటిలో చూడగా, అతని తల్లి గడప వద్ద కూర్చుని యేడ్చుచున్నది. గురువు ఆశ్చర్యపనడి లోనికిపోయి చూడగా అతని భార్యా, కుమారుడు చనిపోయినారు.

గురువు పశ్చాత్తాపపడి మేళా చేయుట, త్రినాథులు కరుణించుట

వారిని చూచి గురువు మూర్ఛపోయాడు. శిష్యుడు పట్టుకొని లేపి కూర్చుండబెట్టి, ముఖముపైనీళ్ళుచల్లి"అయ్యా!తమరుత్రినాథస్వామివారికిఅపరాధులు,త్రినాథమేళాను పాడుచేసినారు. అందుకే మీకిది ప్రతిఫలము.

మీరు నిష్ఠతో స్వామివారి మేళాను చేసిన యెడల మీ భార్యాకుమారులు బ్రతుకుతారు." అని శిష్యుడనగా ఆమాట విని గురువు మైదుమేళాలు యిచ్చుటకు ఒప్పుకొనగా, వెంటనే భార్యా కుమారులు లేచి కూర్చున్నారు. త్రినాథమేళా పాడుచేసినందుకు తగిన శిక్ష దొరికింది. "నేను మూర్ఖుడను, అధముడను, ప్రభువులవారి మహిమ తెలిసికొనలేకపోతిని" అని ప్రభువులవారిని క్షమాపణ వేడి మేళాకు కావలసిన పదార్థములు యావత్తు తెప్పించి అందరితో కలిపి మేళా సమర్పించినాడు. నూనె కాండము చెల్లినది. ప్రభువులవారి పూజకావచ్చినది. ఆకులు, చెక్కలు గంజాయిని అందరూ పంచుకొని సేవించిసుఖమనుభవించినారు.

ఫలశ్రుతి:

ఈ చరిత్ర యెవరు వింటారో వారికి కుష్ఠు వ్యాధి గ్రుడ్డితనము కూడా పోయి తరిస్తారు. పుత్రులు లేని స్త్రీ నిర్మలంగా వింటే పుత్రులు పుడతారు. ఎవరైనా కొంటెగా హాస్యము చెప్పినయెడల నడ్డితనము, గ్రుడ్డితనము కలుగుతుంది. ముగ్గురు త్రిమూర్తులను మూడు స్థలములనుంచి ముందు విష్ణువుని పూజించవలెను. చందనము పువ్వులను తెచ్చి త్రిమూర్తులను వేరువేరుగా పూజించవలెను. నైవేద్యము సమర్పించి గంజాయిలో అగ్నినివేయవలెను.తాంబూలముమూడుభాగములనుచేసివుంచవలెను.త్రిమూర్తులవారి ఎడమభాగమున వినాయకుణ్ణి వుంచవలెను. మూడు దీపములు వెలిగించి 'ఓ త్రినాథస్వాములారా! దయచేయండి". అని అనవలయును. అంతా సమర్పించి త్రినాథస్వాములవారి పాదములపై పడవలెను. అందరూ నిర్మలమైన మనస్సుతో కూర్చొనికథవినవలయును.ప్రసాదముఅందరూపంచుకొనిసేవించవలెను. ఈ విధముగా త్రినాథులను పూజించి తరించండి". అని ఈ కథను సీతాదాసు చెప్పియున్నారు.

శ్లో ॥ మంగళం భగవాన్ విష్ణుః మంగళం మధుసూదన
మంగళం పుండరీకాక్ష మంగళం గరుడధ్వజ
నీలాచల నివాసాయ నిత్యాయ పరమాత్మనే
శ్రీలక్ష్మీ ప్రాణనాథాయ జగన్నాథాయ మంగళం॥
దత్తాత్రేయ పుత్రాయ శ్రీ త్రినాథాయ మంగళం

శ్రీత్రినాథ మేళా సమాప్తము